క్లుప్తంగా

27న బోడుప్పల్‌లో తైబజారు వేలం

బోడుప్పల్: బోడుప్పల్ నగర పాలక సంస్థ తైబజారు వేలాన్ని ఈ నెల 27వ తేదీన వేలం వేయనున్నట్లు కమిషనర్ పద్మజారాణి ఒక ప్రకటనలో వెల్లడించారు. 2023 సంవత్సరం ఏప్రిల్ 1వ తేదీ నుంచి 2024 సంవత్సరం మార్చి 31 వరకు తైబజారు రుసుం వసూలు చేసుకునేందు అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఈ నెల 27వ తేదీన సోమవారం ఉదయం 11 గంటలకు బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు తెలిపారు. కావున ఆసక్తి ఉన్న అభ్యర్థులు రూ.10 వేలను కమిషనర్, బోడుప్పల్ పురపాలక సంస్థ పేరు మీదగా డీడీ చెల్లించి ఈ నెల 25వ తేదీన సాయంత్రం 3 గంటలలోపు బోడుప్పల్ నగర పాలక సంస్థ కార్యాలయంలో దరఖాస్తు పొందవచ్చన్నారు. అదేరోజు సాయంత్రం దరఖాస్తులు చెల్లించేందుకు సాయంత్రం 5 గంటలు వరకు సమయం ఉంది. పూర్తి వివరాలకు నగర పాలక సంస్థ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

ప్లాట్లను కబ్జా చేసి బెదిరిస్తున్న వారిపై చర్యలు తీసుకోండి

ఉప్పల్: ప్లాట్లను కబ్జా చేసి బెదిరింపులకు పాల్పడుతున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, ఆక్రమణదారుల నుంచి రక్షణ కల్పించాలని ఘట్‌కేసర్ మండల వెంకటపురం ప్లాట్ల యాజమానులు కోరుతున్నారు. ఈ మేరకు ఉప్పల్ ప్రెస్ క్లబ్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బాధితులు మాట్లాడారు. 1993లో వెంకటపురం సర్వే నెంబర్-795లో యాజమాని నుంచి నగరంలో నివసించే దాదాపు 32 మంది వరకు ప్లాట్లను కొనుగోలు చేసి రిజిస్ట్రేషన్లు సైతం చేసుకున్నామని, సదరు ప్లాట్లతో గ్రామ పంచాయతీ అనుమతితో తాత్కాలిక గదులను నిర్మించుకొని కబ్జాలో ఉన్నట్లు తెలిపారు. ఆ ప్లాట్లలోకి కొందరూ వ్యక్తులు దౌర్జన్యంగా ప్రవేశించి గోడలు కూల్చి అనేకమార్లు ఇబ్బందులకు గురిచేశారని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయమై కోర్టును ఆశ్రయించామని, సంబంధింత పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు కూడా చేసినట్లు తెలిపారు. తమ ప్లాట్లలోకి అక్రమంగా ప్రవేశించి తమను బెదిరింపులకు గురి చేస్తున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను వారు కోరారు. సమావేశంలో సి.శ్రీకాంత్, కె.మహిపాల్‌రెడ్డి, సంజీవరాజు, గోవర్ధన్‌రెడ్డి, అనంతరెడ్డి, నర్సింహారెడ్డి తదితరులు ఉన్నారు.

వెంటనే నీటి సమస్యను పరిష్కరించాలి


సైనిక్‌పురి జలమండలి కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న కాంగ్రెస్ పార్టీ శ్రేణులు

అల్వాల్: హాథ్ సే హాథ్ జోడో యాత్రలో భాగంగా మచ్చబొల్లారం డివిజన్ పరిధిలోని రాజీవ్ గృహకల్ప వాంబే కాలనీలో మంగళవారం కాంగ్రెస్ పార్టీ మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు నందికంటి శ్రీధర్ పర్యటించారు. ఈ సందర్భంగా కాలనీలో ప్రజలు ఎదుర్కొంటున్న నీటి సమస్యను తెలుసుకున్నారు. అనంతరం సైనిక్‌పురిలోని జలమండలి కార్యాలయం వద్ద పార్టీ శ్రేణులతో కలిసి రాజీవ్ గృహకల్పలో తాగునీటి సమస్యను పరిష్కరించాలని నిరసన, ధర్నా నిర్వహించారు. అనంతరం జలమండలి జనరల్ మేనేజర్‌ను కలిసి రాజీవ్ గృహకల్ప తదితర ప్రాంతాల్లో నీటి సమస్యను పరిష్కరించాలని వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా నందికంటి శ్రీధర్ మాట్లాడుతూ రాజీవ్ గృహకల్ప తదితర ప్రాంతాల్లో రూపాయి నీటి కనెక్షన్ ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.



- గ్రామ పంచాయతీల్లో పనుల పర్యవేక్షణ, నిర్వహణకు సాంకేతికత జత
- ఉదయం 7 గంటలకే విధులకు రావాలని ఆదేశం
- ఇబ్బంది పడుతున్న గ్రామ కార్యదర్శులు
- సర్వర్ మొరాయింపుతో యాప్‌తో ఫొటోలు జత చేయలేకపోతున్న కార్యదర్శులు
- 7 పంచాయతీల్లో కార్యదర్శుల పోస్టులు ఖాళీ

ప్రత్యేక యాప్‌తో.. పారిశుద్ధ్య పర్యవేక్షణ

సాక్షి, మేడ్చల్ జిల్లా: గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్వహణ, పర్యవేక్షణకు సాంకేతికతను జోడించడం వల్ల పంచాయతీ కార్యదర్శులకు పలు ఇబ్బందులు తప్పడం లేదు. దీనికి సంబంధించిన విధి విధానాలను ఉన్నతాధికారులు గ్రామ పంచాయతీ కార్యదర్శులకు చేరవేయడంతో.. కార్యదర్శులు విధులకు గతంలో మాదిరిగా ఉదయం 9 గంటలకు కాకుండా ప్రస్తుతం ఉదయం 7 గంటలకు రావాల్సిన పరిస్థితి ఏర్పడింది. ప్రతీ రోజూ ఉదయం 8 గంటలలోపు వరకే కార్యదర్శులు పంచాయతీ కార్యాలయానికి చేరుకొని పారిశుద్ధ్య నివేదిక (డీఎస్‌ఆర్) యాప్‌లో తమ ఫొటోలను తీసి పంపించాల్సి ఉంటుంది. ఇలా పంపిస్తేనే వారు విధులకు హాజరైనట్లుగా గుర్తిస్తారు. లేని పక్షంలో గైర్హాజరైనట్లు పరిగణిస్తారు.

సర్వర్ మొరాయింపు..

గ్రామ పంచాయతీ పరిధిలో రోడ్లు శుభ్రం చేయడం, కార్మికులు మురుగు కాల్వలు తీసే ఫొటోలు, కంపోస్టు షెడ్డు, వైకుంఠధామం, పల్లెప్రకృతి వనం, ప్రభుత్వ కార్యాలయాల వద్ద జరిగే పనులను ఫొటోలు తీసి ఎప్పటికప్పుడు డీఎస్‌ఆర్ యాప్‌లో పొందుపర్చాల్సి ఉంటుంది. ఇలా అందరూ ఒకేసారి యాప్‌లో పొందపర్చడం ద్వారా ఒక్కోసారి సర్వర్ మొరాయిస్తోందని చాలా మంది కార్యదర్శులు ఆవేదన చెందుతున్నారు. ఈ ప్రక్రియలో వారు సొంత సెల్ ఫోన్లు వినియోగిస్తున్నారు. కొన్ని గ్రామాల్లో నెట్‌వర్క్ పనిచేయక నమోదుకు కష్టమవుతోందంటున్నారు.

మరో చోట నివాసం..

చాలా మంది గ్రామ కార్యదర్శులు పనిచేసే చోట కాకుండా నగరంలో నివాసం ఉండగా.. అధికారులు ఆదేశించిన సమయానికి రావాలంటే వ్యయ ప్రయాసాలకు గురికావల్సి వస్తోందని వాపోతున్నారు. మారుమూల గ్రామాలు, తండాల్లో పనిచేసే వారికి రోజూ ఇక్కట్లు తప్పడం లేదు. ముఖ్యంగా మహిళా కార్యదర్శుల ఇబ్బందులు చెప్పనలవి కాకుండా ఉన్నాయి. ఈ విషయమై జిల్లా పంచాయతీ అధికారి రమణమూర్తి మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో 61 పంచాయతీల్లో రోజూ జరిగే పారిశుద్ధ్య నిర్వహణ వివరాలను డీఎస్‌ఆర్ యాప్ నమోదు చేయాలని ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు.

7 పంచాయతీలకు ఇన్‌చార్జి కార్యదర్శులే...

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో 61 గ్రామ పంచాయతీలు ఉండగా, ఏడు గ్రామ పంచాయతీల్లో కార్యదర్శి పోస్టులు ఖాళీగా ఉన్నాయి. దీంతో పక్కనున్న పంచాయతీ కార్యదర్శులను ఇన్‌చార్జిలుగా విధులు నిర్వహిస్తున్నారు. ఆర్థిక సంవత్సరం ముగుస్తుండటంతో.. లక్ష్యానికి అనుగుణంగా ఇంటి పన్నుతో సహా వివిధ రకాల పన్నుల వసూళ్లపై గ్రామ కార్యదర్శులు ప్రత్యేక దృష్టి పెట్టాల్సిన అవసరం ఏర్పడుతోంది. డీఆర్‌ఎస్‌యాప్‌తో ఇన్‌చార్జి బాధ్యతల్లో అదనపు విధులు నిర్వహిస్తున్న గ్రామ కార్యదర్శులు మరిన్నీ సమస్యలు ఎదుర్కోవల్సి వస్తోందని వాపోతున్నారు. ప్రస్తుతం మేడ్చల్ మండలంలో నాలుగు పంచాయతీ కార్యదర్శుల పోస్టులు ఖాళీగా ఉండగా, శామీర్‌పేట్, ఘట్కేసర్, కీసర మండలాల్లో ఒక్కోటి చొప్పున గ్రామ కార్యదర్శి పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఈ ఏడు గ్రామ పంచాయతీలు ఇన్‌చార్జిల పాలన కొనసాగుతోంది.

కాలనీ సమస్యలు పరిష్కరించాలని వినతి


కాలనీ సమస్యలపై ఎమ్మెల్యే వినతిపత్రం అందజేస్తున్న శ్రీరామ్‌నగర్ వాసులు

కాప్రా: కాలనీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కాప్రా డివిజన్ శ్రీరామ్‌నగర్ కాలనీవాసులు విజ్ఞప్తి చేశారు. ఈ విషయంపై మంగళవారం ఎమ్మెల్యే భేతి సుభాష్‌రెడ్డి కాలనీ అసోసియేషన్ ప్రతినిధులు కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తమ కాలనీలో డ్రైనేజీ, సీసీ రోడ్ల సమస్య నెలకొందని తెలిపారు. కాలనీల్లోని సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరారు. ఈ విషయంపై ఎమ్మెల్యే సుభాష్‌రెడ్డి సానుకూలంగా స్పందించనట్లు కాలనీ అసోసియేషన్ ప్రతినిధులు తెలిపారు. కార్యక్రమంలో లక్ష్మీనారాయణ, జగ్గారెడ్డి, పెంటారెడ్డి, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

అవకాశం కల్పిస్తే నైపుణ్యం కనబరుస్తారు

కాప్రా: ప్రపంచ డౌన్ సిండ్రోమ్ దినోత్సవాన్ని మంగళవారం కాప్రా డివిజన్ ఎల్లారెడ్డిగూడలోని అనురాగ్ మానసిక వికలాంగుల స్కూల్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పెయింటింగ్ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం స్కూల్ డైరెక్టర్ డాక్టర్ రామ్ మాట్లాడుతూ.. సాధారణ పిల్లల మాదిరిగానే ఈ పిల్లలకు కూడా తల్లిదండ్రులు అవకాశం కల్పిస్తే వారు నైపుణ్యం కనబరుస్తారని తెలిపారు. డౌన్ సిండ్రోమ్ దినోత్సవం సందర్భంగా ఎల్లారెడ్డిగూడ నుంచి ర్యాలీగా వెళ్లిన విద్యార్థులు నేరేడ్‌మెట్, సైనిక్‌పురి, ఈసీఐఎల్‌లో అవగాహన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ ప్రభుదాస్, రెవెన్యూ సిబ్బంది, పోలీసు సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.


డౌన్ సిండ్రోమ్ దినోత్సవం సందర్భంగా ర్యాలీ

సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుభాష్‌రెడ్డి

హబ్సిగూడ: ఉప్పల్ నియోజకవర్గం పలువురు బీఆర్‌ఎస్ పార్టీ కార్పొరేటర్లు, మాజీ కార్పొరేటర్లు, డివిజన్ అధ్యక్ష కార్యదర్శులతో మంగళవారం హబ్సిగూడలో ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి బీఆర్‌ఎస్ పార్టీ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఈ నెల 26వ తేదీన మల్లాపూర్‌లో నిర్వహించే ఆత్మీయ సమ్మేళనం ఏర్పాట్లపై చర్చించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుభాష్‌రెడ్డి మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ నేతృత్వంలోని బీఆర్‌ఎస్ పార్టీ ప్రభుత్వ హయాంలో నిర్వహించే సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు ప్రభుదాస్, దేవేందర్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్లు కొత్త రామారావు, శ్రీనివాస్‌రెడ్డి, బీఆర్‌ఎస్ డివిజన్ల అధ్యక్ష కార్యదర్శులు, పార్టీ నేతలు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఉగాది కవి సమ్మేళనం


కవి సమ్మేళనం నిర్వహిస్తూ..

రామంతాపూర్: హృదయ భారతి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ మంగళ మక్కపాటి ఆధ్వర్యంలో రామంతాపూర్ ఆర్టీసీ కాలనీ కమ్యూనిటీహాలులో మంగళవారం శ్రీశోభకృత్ ఉగాది కవి సమ్మేళనాన్ని ఘనంగా నిర్వహించారు. సమ్మేళనంలో పాల్గొన్న కవులు తమ కవితలో ఉగాది పండుగ విశిష్టతను వివరించారు. ఈ సందర్భంగా హాజరైన వక్తలు మాట్లాడుతూ.. ఈ ఏడు వచ్చిన శ్రీశోభకృత్ ఉగాదిలో ఉన్న శుభాకృత్ పదం వెలుగును సూచిస్తుందని ఉగాది పర్వదినం అందరి జీవితాల్లో వెలుగు నింపాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో జాతీయ సాహిత్య పరిషత్ అధ్యక్షుడు కసిరెడ్డి వెంకట్‌రెడ్డి, ప్రముఖ సాహితీవేత్త లక్కరాజు నిర్మల, ఆచార్య చెన్నప్ప, ఆధ్యాత్మికవేత్త బ్రహ్మం, మాజీ ఎమ్మెల్యే, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎన్‌వీఎస్‌ఎస్ ప్రభాకర్, కార్పొరేటర్ కక్కిరేని చేతన పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి ఆర్థిక సాయం


ఆలయ కమిటీ సభ్యులకు చెక్కును అందజేస్తున్న బండారి లక్ష్మారెడ్డి

మల్లాపూర్: మల్లాపూర్ యాదవ సంఘం ఆధ్వర్యంలో నూతనంగా నిర్మిస్తున్న మల్లన్న స్వామి దేవాలయానికి బీఎల్‌ఆర్ ట్రస్ట్ వ్యవస్థాపకులు, బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు బండారి లక్ష్మారెడ్డి రూ.లక్ష చెక్కును ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. ఆలయ అభివృద్ధికి తన సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో మల్లాపూర్ కార్పొరేటర్ పన్నాల దేవేందర్ రెడ్డి, కొమురవెల్లి మల్లన్న దేవస్థాన పాలక మండలి డైరెక్టర్ ఎర్రగోల్ల మల్లేశ్ యాదవ్, బీఎల్‌ఆర్ ట్రస్ట్ ప్రతినిధి కటార్ల భాస్కర్, అల్లాడి కృష్ణయాదవ్, నర్సింగ్ యాదవ్, పల్లె కుమార్ యాదవ్, రాజమల్లు, శ్రీనివాస్ యాదవ్, శ్రీను యాదవ్, సంతు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

పల్లవి స్కూల్‌లో ఉగాది వేడుకలు



బోడుప్పల్: బోడుప్పల్ పల్లవి మోడల్ స్కూల్‌లో మంగళవారం 9వ తరగతి విద్యార్థులు శోభకృత నామ సంవత్సర ఉగాది వేడుకలను వైభవంగా నిర్వహించారు. తెలుగు వారి మొదటి పండుగ ఉగాది కావడంతో విద్యార్థులు ప్రతిజ్ఞ, ప్రార్థన చేసి ఉగాది విశిష్టత, ఉగాది పచ్చడి షడ్ రుచుల గురించి వివరించారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ప్రధానోపాధ్యాయురాలు తనూజ, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉన్నారు.

ఘనంగా భాష్యం పాఠశాల వార్షికోత్సవం


విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు

గౌతంనగర్: విద్యార్థులు కష్టపడి కాకుండా ఇష్టపడి చదవాలని రైల్వే పరిపాలన అధికారి మాలతి అన్నారు. మల్కాజిగిరి భాష్యం పాఠశాల వార్షికోత్సవం వేడుకలు లక్ష్మిసాయి గార్డెన్స్‌లో మంగళవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు అన్నిరంగాల్లో రాణించాలన్నారు. అనంతరం విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు, దేశభక్తి గీతాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమలో సీఈఓ చైతన్య, జోనల్ ఇన్‌చార్జి మార్కండేయులు, ప్రిన్సిపాల్ కోమలి తదితరులు పాల్గొన్నారు.

డీహెచ్‌పీఎస్ వాల్‌పోస్టర్ ఆవిష్కరణ


డీహెచ్‌పీఎస్ మహాసభల వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తూ..

కాప్రా: దళిత హక్కుల పోరాట సమితి డీహెచ్‌పీఎస్ రాష్ట్ర మహాసభల వాల్‌పోస్టర్‌ను మంగళవారం ఏఎస్‌రావునగర్ డివిజన్ కమలానగర్‌లో ఆవిష్కరించారు. డీహెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు ఏసురత్నం హాజరై ఆవిష్కరించి విజయవంతం చేయాలని కోరారు. ఈ నెల 31వ తేదీన నగరంలోని ఓయూలో రాష్ట్ర తొలి మహాసభలు జరగనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, కార్యదర్శి సహదేవ్, సహాయ కార్యదర్శి చిలుముల మహేష్, నాయకులు యాదగిరి, అశోక్, ఆనందరావు, ఎల్లన్న తదితరులు పాల్గొన్నారు.

అదనపు అంతస్తు నిర్మించాలి


ఎమ్మెల్యే సుభాష్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న మహిళామండలి సభ్యులు

కాప్రా: ఏఎస్‌రావునగర్ డివిజన్ మహిళామండలి భవనంపై అదనపు అంతస్తు నిర్మించాలని మహిళా మండలి సభ్యులు కోరారు. ఇదే విషయంపై మంగళవారం ఎమ్మెల్యే భేతి సుభాష్‌రెడ్డిని కలిసి వినతి పత్రం అందించారు. తమ వినతిపై ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించినట్లు మహిళామండలి సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో రమాదేవి, కమల, నిర్మల దేవి, సువర్ణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నిధులు మంజూరు చేయాలని వినతి


కమిషనర్ లోకేష్‌కుమార్‌కు వినతి పత్రం అందజేస్తున్న కార్పొరేటర్ శాంతి సాయిజెన్‌శేఖర్

మల్లాపూర్: నాచారం డివిజన్ పరిధిలోని పెండింగ్‌లో ఉన్న ప్రధాన సమస్యలకు నిధులు మంజూరు చేయాలని కోరుతూ మంగళవారం జీహెచ్‌ఎంసీ కమిషనర్ లోకేష్‌కుమార్‌కు జీహెచ్‌ఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యులు, నాచారం కార్పొరేటర్ శాంతి సాయిజెన్ శేఖర్ వినతి పత్రం అందజేశారు. ముందుగా ఎర్రకుంటలోని హిందూ శ్మశాన వాటికను వైకుంఠధామంగా తీర్చిదిద్దేందుకు నిధులు మంజూరు చేస్తామని కమిషనర్ హామీ ఇచ్చినట్లు కార్పొరేటర్ తెలిపారు.

మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలి



రామంతాపూర్: శ్రీనివాసపురంలోని కందుకూరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన మహిళా దినోత్సవ వేడుకకు రాష్ట్ర మున్నూరు కాపు సంఘం మహిళా కన్వీనర్ బండి పద్మ, పారిశ్రామికవేత్త కనపర్తి హైమవతి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందినప్పుడే దేశం అభివృద్ధి చెందుతుందన్నారు. కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ కందుకూరు శివరాణి, ఆకుల సంధ్యారాణి, సరిత, మాలతి తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ సేవాభావాన్ని అలవర్చుకోవాలి

కుషాయిగూడ: ప్రతిఒక్కరూ సేవాభావాన్ని అలవర్చుకోవాలని మీర్‌పేట్-హెచ్‌బీకాలనీ కార్పొరేటర్ ప్రభుదాస్ అన్నారు. పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకొని ఇనాయ ఎడ్యూకేషన్ అండ్ చారిటబుల్ ట్రస్టు వారు 25 కిలోల బియ్యం, నెల సరుకులను సమకూర్చారు. హెచ్‌బీకాలనీలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో కార్పొరేటర్ పాల్గొని ముస్లింలకు బియ్యం, నిత్యావసర సరుకులను అందజేశారు. బీఆర్‌ఎస్ మైనార్టీ నేత మహ్మద్ బద్రుద్దీన్, ట్రస్టు ప్రతినిధులు పాల్గొన్నారు.


ముస్లింలకు నిత్యావసర సరుకులను అందజేస్తున్న కార్పొరేటర్ ప్రభుదాస్

పేద కుటుంబానికి ఆర్థిక సాయం


ఆర్థికసాయం అందజేస్తున్న బీఎల్‌ఆర్ ట్రస్టు ప్రతినిధి నేమూరి మహేష్‌గౌడ్

కుషాయిగూడ: ఇటీవల గుండెపోటుతో మృతిచెందిన చర్లపల్లి డివిజన్ గాంధీనగర్‌కు చెందిన జింకల చంద్రమౌళి కుటుంబ సభ్యులకు మంగళవారం బీఎల్‌ఆర్ ట్రస్టు ప్రతినిధులు రూ.10 వేల ఆర్థికసాయం అందజేశారు. ఇంటి పెద్ద చనిపోవడంతో దిక్కుతోచని స్థితిలో పడ్డ వారి కుటుంబానికి చేయూత ఇవ్వాలన్న ట్రస్టు చైర్మన్ బండారి లక్ష్మారెడ్డి ఆదేశాల మేరకు ఆర్థిక సాయం అందజేసి మనోధైర్యం కల్పించినట్లు ట్రస్టు ప్రతినిధి నేమూరి మహేష్‌గౌడ్ తెలిపారు. ఆపదలో ఉన్న వారికి బీఎల్‌ఆర్ ట్రస్టు అండగా నిలుస్తుందన్నారు. కార్యక్రమంలో జూపల్లి శ్రీశైలం, గోపాల్‌యాదవ్, వెంకటేష్‌యాదవ్, రంగారెడ్డి, రాంచందర్, శ్రీధర్‌చారి, శ్రీనివాస్‌గౌడ్, సుందర్‌చారి తదితరులు పాల్గొన్నారు.

పేదలకు పట్టాలివ్వాలి


మాట్లాడుతున్న బాలమల్లేష్

బోడుప్పల్: జీవో నంబర్-58 ప్రకారం ప్రభుత్వ స్థలాల్లో గుడిసెలు, ఇళ్లు నిర్మించుకున్న పేదలందరికీ పట్టాలు మంజూరు చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎన్.బాలమల్లేష్ అన్నారు. బోడుప్పల్ ఎస్ఎస్ఎస్ గార్డెన్‌లో మంగళవారం మేడిపల్లి మండల కార్యదర్శి రచ్చ కిషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన మండల సీపీఐ కౌన్సిల్ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. మేడిపల్లిలోని ప్రభుత్వ స్థలంలో గుడిసెలు వేసుకున్నవారికి ఇళ్లు నిర్మించుకున్న వారికి క్రమబద్ధీకరించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ నెల 26, 27 తేదీల్లో వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర సమావేశాలను కరీంనగర్‌లో నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో నేతలు జె.లక్ష్మి, టి.శంకర్, ప్రమీల, దండు రమేష్, వీబీ బాలరాజ్ మహాలక్ష్మి, ఐలయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో వసతుల కల్పనకు సహకరిస్తా

కుషాయిగూడ: ప్రభుత్వ పాఠశాలల్లో వసతుల కల్పనకు తనవంతు సహకారం అందజేస్తానని ఏఎస్‌రావునగర్ మాజీ కార్పొరేటర్, కమలానగర్ స్ఫూర్తి లయన్స్ క్లబ్ వ్యవస్థాపకులు పజ్జూరి పావనీరెడ్డి అన్నారు. తన కూతురు కావ్యపిరెడ్డి పుట్టినరోజు వేడుకలను చర్లపల్లి ప్రభుత్వ పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. పాఠశాలకు అవసరమైన ఫ్యాన్లు, విద్యార్థులకు వాటర్ బాటిళ్లను అందజేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో వసతుల కల్పనకు సహకారం అందజేస్తానని ఆమె పేర్కొన్నారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం శోభారాణి, విజయ్‌కుమార్, వంజరి ప్రవీణ్, సీతారాంరెడ్డి, నాగేశ్వర్‌రెడ్డి, సింగం రాజు, నరసింహ, రాజేశ్వర్ రెడ్డి, పెంచాల సురేందర్‌రావు, గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.